క్లుప్తంగా

12న బహిరంగ వేలం

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు కొబ్బరికాయలు, పూజ సామగ్రి, లడ్డూ ప్రసాదం విక్రయించుటకు, కొబ్బరి చిప్పలు సేకరణకు, తలనీలాలు పోగు చేసుకోవడానికి ఈ నెల 12న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం దేవదాయ- ధర్మదాయ శాఖ కమిషనర్ ఆమోదంతో మధ్యాహ్నం 2 గంటలకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ఖచ్చితంగా దరావత్తు చెల్లించాలన్నారు. ఈ బహిరంగ వేలం షరతులకు లోబడి ఉంటుందన్నారు.

12న మున్సిపల్ కార్యాలయం ముట్టడి

వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుమాయూన్ బాషా



పిడుగురాళ్ల: వలంటీర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 12వ తేదీన పిడుగురాళ్ల పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుమాయూన్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం పిడుగురాళ్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపాలిటీలోని రాజీనామా చేసిన, రాజీనామా చేయని వలంటీర్లందరూ ముట్టడిలో పాల్గొన్నాలన్నారు. ఐలాండ్ సెంటర్ నుంచి భారీర్యాలీతో మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి వలంటీర్ల సమస్యలపై గళమెత్తాలన్నారు. ప్రతి ఒక్క వలంటీర్ భారీ ర్యాలీలో, మున్సిపల్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం ఉపాధ్యక్షుడు గౌస్ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిపై నేటి నుంచి శిక్షణ తరగతులు

శావల్యాపురం: నేటి నుంచి నాలుగు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంపీడీవో పేరుమీనా సీతా రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10, 11 రెండు రోజుల పాటు సర్పంచులు, మండల స్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, వెటర్నరీ సహాయకులు, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు 60 మంది శిక్షణా తరగతులకు హాజరు కావాలన్నారు. ఈనెల 12,13 తేదీలు రెండు రోజులపాటు వేల్ఫేర్ సహాయకులు, మహిళా పోలీసులు, ఎనర్జీ సహాయకులు, అగ్రికల్చర్ సహాయకులు, విలేజ్ సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రేడు-5, సచివాలయ విలేజ్ రెవెన్యూ అధికారులు, సహాయ సిబ్బంది 56 మంది తప్పనిసరిగా ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

12న చినకంచర్ల మేడి చెరువు వేలం

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో ఉన్న మేడి చెరువును బహిరంగ వేలం పాట ఈనెల 12న ఉదయం 11 గంటలకు ఎంపీయూపీ పాఠశాల ప్రాంగణంలో జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి చక్రవరం శ్రీవల్లీ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ వేలంపాటలో పాల్గొనే వారందరు దరావత్తు రూ. 20 వేలు చెల్లించాలన్నారు. ఈ వేలంపాటలో ఎవరైనా పాల్గొనవచ్చునన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు వేలంపాట జరుగుతుందని అధికారులదే తుది నిర్ణయమన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు



పెదకూరపాడు : మండల కేంద్రంలోని జీఆర్‌సీ ఆర్కే శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో గుత్తా రత్నచంద్ర రామకోటేశ్వరి మెమోరియల్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళ, బుధ వారాల్లో జరుగుతాయని జీఆర్‌సీ ఆర్కే స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు గుత్తా కవితా రాము సోమవారం తెలిపారు. పలు మెమోరియల్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలకు నగదు, ప్రోత్సాహక బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఈ పోటీలను ప్రారంభించనున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



పెదకూరపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ యువకుడు సోమవారం మృతి చెందాడు. పాటిబండ్ల గ్రామానికి చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్ సత్తనపల్లిలో నివాసం ఉంటూ పాటిబండ్లలో ఉన్న తల్లిని చూసేందుకు వచ్చి తిరిగి వెళుతూ ఆదివారం పెదకూరపాడులో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఖాజామొహిద్దిన్ మృతి చెందినట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు.

నరికారు.. నాటడం మరిచారు

- వైఎస్సార్ సీపీ హయాంలో పట్టణమంతా మొక్కలు నాటిన వైనం
- నేడు చెట్లు కొట్టించిన కూటమి నేతలు
- మోనోకార్పస్ మొక్కలు ఉండకూడదని ప్రభుత్వ అనుమతులు రాకముందే తొలగింపు
- తొలగించి ఐదు నెలలవుతున్నా కొత్త మొక్కలు నాటని వైనం
- ప్రచార బోర్డులు కనిపించాలనే తొలగించారంటున్న ప్రజలు



పిడుగురాళ్ల మెయిన్‌రోడ్డు డివైడర్‌పై మొక్కలను తొలగించిన దృశ్యం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం వ్యాపార పరంగా మరో ముంబయిగా పేరుగాంచింది. నిత్యం సున్నపు కాలుష్యం కోరల్లో కొట్టుమిట్టాడుతూ ఉంటుంది. అలాంటి కాలుష్యం కోరల నుంచి ప్రజలను కాపాడాలని, పట్టణం గ్రీనరీకి నిలయంగా మార్చాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తలంచి పట్టణం మొత్తం మోనోకార్పస్ మొక్కలను నాటించారు. ఆ మొక్కలు ఏపుగా పెరిగి అందంగా కనిపించేవి. కాలుష్యం నుంచి మొక్కల ద్వారా ప్రజలకు ఉపశమనం కలుగుతుందనుకున్న సమయంలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెరిగిన చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికి ప్రచార బోర్డులను ఏర్పాటు చేశారు. చెట్లను నరికి.. వాటి స్థానంలో వేరే మొక్కలను నాటుతామని సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేశారు. కానీ మొక్కలను నాటలేదు. అయితే మోనో కార్పస్ మొక్కలు మళ్లీ చిగిరించి మొలకెత్తుతున్నాయి.

ప్రచారం కోసమే తొలగింపు..?

పిడుగురాళ్ల పట్టణంలో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన డివైడర్లపై సుమారు 40 అడుగులకు ఒక ప్రచార బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే గతంలో పెరిగిన చెట్లు డివైడర్లపై ఉండటంతో ప్రచార బోర్డులు కనిపించేవి కావు. అయితే మోనోకార్పస్ మొక్కలు ఉంటే ప్రమాదమంటూ కూటమి నాయకులు హడావుడిగా పెరిగిన చెట్లను తొలగించారు. ఇప్పుడు ప్రచారం బోర్డులు ప్రత్యేకంగా ప్రజలకు కనిపిస్తున్నాయి. అందుకే పట్టణప్రజలు కొందరు ప్రచార బోర్డుల కోసమే ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించారా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

కొత్త మొక్కలు ఏవీ..?

హంగు ఆర్భాటాలతో ప్రజలకు ఎంతో మేలు చేసే చెట్లను పెంచుతామంటూ ఉన్న చెట్లను కూటమి నేతలు పిడుగురాళ్ల పట్టణంలో తొలగించారు. కానీ నాటడం మాత్రం మరిచారు. ఈ చెట్లను తొలగించి సుమారు 5 నెలలు అవుతున్నా ఒక మొక్క కూడా నాటలేదు. చివరికి ప్రకృతి సహకరించి, మొక్కలు మళ్లీ చిగురించడం మొదలుపెట్టాయి.

నిధులు మంజూరైతేనే కొత్త మొక్కలు..

అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, అప్పటి మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ సూచనలతో మున్సిపల్ సిబ్బంది మోనోకార్పస్ మొక్కలను తొలగించటం జరిగింది. ఇప్పుడు నూతనంగా మొక్కలు నాటాలంటే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై, ఆదేశాలు వస్తేనే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి ఎటువంటి నిధులు, అనుమతులు రాలేదు.

– రాఘవేంద్ర, మున్సిపల్ ఏఈ

మాచర్ల పట్టణానికి నీరందించండి



తహసీల్దార్ బత్తుల వాణికి అర్జీ అందజేస్తున్న గుండాల సైదులు

మాచర్ల రూరల్: మాచర్ల పట్టణ తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అనుపు రిజర్వాయర్ నుంచి పైపులైన్ ఏర్పాటు చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గుండాల సైదులు కోరారు. సోమవారం స్పందనలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. అమృత స్కీం పథకం కింద పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.80కోట్లతో బుగ్గవాగు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పైపులైన్ నుంచి మాచర్ల పట్టణానికి నీరందించేందుకు అధికారులు అంచనాలు వేశారని, సాగర్ జలాశయానికి నీటిఎద్దడి ఏర్పడినపుడు బుగ్గవాగులో సరిపడినంత నీరు ఉండదని, సాగర్ రిజర్వాయర్ అయిన అనుపులో 365 రోజులు నీటి స్టోరేజి ఉంటుందని, ప్రభుత్వం దీనిపై ఆలోచన చేసి అనుపు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మాచర్ల పట్టణానికి నీరందించాలని తహసీల్దార్ బత్తుల వాణికి వినతి పత్రం అందజేశారు. పట్టణంలో కోతుల బెడద అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పల్లె శ్రీనివాసరావు, కొమెర తిరపతయ్యలు వినతి పత్రాలు అందజేశారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని డిపో మేనేజర్ బి.కోటేశ్వరరావు నాయక్ ఆధ్వర్యంలో డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గతంలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో మిర్యాల గ్రామ ప్రజలు మిర్యాలకు బస్సును నడపాలని కోరగా ఆ బస్సును 10వ తేదీ ఉదయం 6.45 గంటల నుంచి నడపటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. సమస్యలపై 9959225430 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని ఆయన సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన తేళ్ల ఫణికుమార్, సునీత దంపతులు రూ.50,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో సోమవారం ఈవో నలబోతు మాధవీలతకు దాతలు విరాళం చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దుర్గి: మండలంలోని ముటుకూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ప్రహరీ పక్క స్థలములో కొంతమంది వ్యక్తులు అక్రమంగా దేరాలు కట్టి షటిల్ బ్యాడ్మింటిన్ కోర్టును ఏర్పాటు చేశారని, సంబంధిత గ్రామంలో పెద్దలకు, అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ అర్జీ రూపంలో విన్నవించాడు. ఈ బ్యాడ్మింటన్ కోర్టు పాఠశాల విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రస్తుతం ఉదయం 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయని, విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలుగుతుందన్నారు. అదే విధంగా సాయంత్రం సమయంలోనూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్రమంగా పాఠశాలలోని విద్యుత్‌ను చౌర్యం చేస్తున్నారన్నారు. సర్పంచ్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.

వాసవి క్లబ్ మాచర్ల పట్టణ అధ్యక్షుడిగా రవితేజ



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు

మాచర్ల: పేద, మధ్య తరగతివారి అభివృద్ధికి వాసవి క్లబ్ విశేష సేవలు అందిస్తోందని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. సోమవారం పట్టణంలోని సాయి వాసవి కంప్యూటర్స్‌లో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షుడు భవనాశి వెంకటేశ్వర్లు విచ్చేసి అధ్యక్షుడిగా భవనాశి రవితేజ, సెక్రటరీగా బత్తుల వీరబ్రహ్మం, కోశాధికారిగా బచ్చు రాజ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీగా మేడం శివ రామకృష్ణలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. తిరివీధి వెంకట నాగేశ్వరరావు, 2025 జోన్ చైర్మన్ ఒరుగంటి చెన్నకేశవ రావు, క్యాబినెట్ సభ్యులు మేడం శివ నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు దుప్పట్లు పంపిణీ

చిలకలూరిపేట: ఒయాసిస్ సంస్థ సేవలు విలువైనవని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మురికిపూడి గ్రామంలో నిరుపేద మహిళలు 100 మందికి దుప్పట్లు, అల్పాహారం సోమవారం పంపిణీ చేశారు. 11 మంది సభ్యులతో ప్రారంభమైన ఒయాసిస్ సంస్థ నేడు 160 మందితో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ ఒయాసిస్ ఆధ్వర్యంలో సేవాశ్రమం నిర్మాణం చేస్తున్నట్లు చెప్పా రు. కార్యక్రమంలో ఒయాసిస్ సభ్యులు కరణం విజయలక్ష్మి, కోలా విజయలక్ష్మి, గట్టు సరోజిని, ఎ.శైలజ, పి.రమ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఉపకార వేతనాలు పంపిణీ



ఉపకార వేతనాలను అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

శావల్యాపురం: ఉల్లాస్ ట్రస్టు సారథ్యంలో ప్రతి ఏటా ప్రతిభావంతులకు అందజేస్తున్న ఉపకారవేతనాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం ఉల్లాస్ ట్రస్టు సారథ్యంలో మండలంలోని వేల్పూరు, శావల్యాపురం గ్రామాల్లో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లోని విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్టు ప్రతినిధి వెంకట్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్య పరంగా ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు.

అనంతరం రెండు పాఠశాలల్లో 9,10 తరగతుల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 1000 రూపాయలు చొప్పున నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ ప్రతినిధులు రవిశంకర్, శంతన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని, సీనియర్ ఆంగ్ల బోధకులు స్టాఫ్ సెక్రటరీ బెజవాడ వెంకట నాగేశ్వరరావు, వ్యాయమా ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్, శ్రీకాంత్, భువనేశ్వరి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాదెండ్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృత్యువాతపడిన సంఘటన చిలకలూరిపేట బైపాస్ రోడ్డులో నాదెండ్ల ఫ్లైఓవర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 60 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ఫ్లైఓవర్ మీదుగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. రోడ్డుపై పడిపోయిన మృతదేహంపై నుంచి అటుగా వెళ్తున్న వాహనాలు వెళ్లటంతో మృతదేహం ఛిద్రమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప మాలధారుడు దుర్మరణం



కోటిరెడ్డి (ఫైల్)

పెదకూరపాడు: అయ్యప్ప స్వామి పడి పూజ భజన ఏర్పాట్లను పర్యవేక్షించి, స్వగ్రామం వస్తున్న అయ్యప్ప మాలదారుని లారీ రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ఘటన మండలంలోని పరస-75త్యాళ్లూరు గ్రామాల మధ్య మైత్రీ వనం సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 75త్యాళ్లూరుకు చెందిన వజ్రాల కోటిరెడ్డి (38) రియల్ ఎస్టేట్ సంస్థలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. కంభంపాడు గ్రామంలో పడి పూజ భజన పనులు పర్యవేక్షించి, తిరిగి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం బయలుదేరాడు. గ్రామ సమీపంలోని మైత్రివనం వద్దకు వచ్చిన క్రమంలో వెనుక నుండి వస్తున్న ఒక సబ్బుల కంపెనీకి చెందిన లారీ కోటిరెడ్డి దిచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో కిందపడిపోయిన కోటిరెడ్డిపై వెనుక లారీ టైర్లు ఎక్కడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. లారీ డ్రైవర్ వాహనం నిలపకుండా వెళ్లడంతో స్థానికులు వెంబడించి పెదకూరపాడు గ్రామంలో వాహనాన్ని అడ్డుకొన్నారు. పెదకూరపాడు పోలీసే స్టేషన్‌కు తరలించారు. మృతుడికి భార్య శ్రీలత, కొశిరెడ్డి, సుస్మితసాయి సంతానం. కుటుంబ ఆధారం కోల్పోయామంటూ మృతుడి భార్య కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్సై గిరిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని పురుషోత్తమపట్నం బైపాస్ మార్గంలో వున్న యేసు క్రీస్తు దివ్య శాంతి నిలయంలో సోమవారం ది చిలకలూరిపేట గాస్పెల్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక పాస్టర్ నందమూరి క్రిస్టర్, ఒలివా మినిస్ట్రీస్ అధినేత రత్న కుమార్ హాజరై ప్రత్యేక క్రిస్మస్ సందేశం వినిపించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఇందులో భాగంగా నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరించారు. పాస్టర్లందరికీ నూతన వస్త్రాలు బహూకరించారు. ఫెలోషిప్ అధ్యక్షుడు గుమ్మడి కోటేశ్వరరావు, కార్యదర్శి బి.రవికుమార్, ట్రెజరర్ కె.డేవిడ్ రాజు, ఎస్.అబ్రహాం, థామస్, శ్యాంసన్, దేవకుమార్, అబ్రహాం పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి

- గురజాల డీఎస్పీ జగదీష్
- రెంటచింతల పీఎస్‌లో ఆకస్మిక తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న గురజాల డీఎస్పీ జగదీష్

రెంటచింతల: శాంతిభద్రతల నిర్వహణలో జవాబుదారీగా ఉంటూ పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. సోమవారం ఆయన రెంటచింతల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించి సుమారు 8 గంటల పాటు వివిధ గ్రామాలకు సంబంధించిన కేసుల రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని ఎవరూ అతీతులు కారని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారిని మర్యాదగా పలకరించి బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించాలన్నారు. స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామం ప్రశాంతంగా ఉండటానికి ప్రజలు పోలీసులకు సహకరించాన్నారు. గ్రామాలలో పొలం తగాదాలు, నగదు వివాదాలు, ఆస్తి పంపకాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరికైన సమస్యలు ఉంటే ముందుగానే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కోర్టులలో వివాదాలు పెండింగ్‌లలో ఉన్న సమయంలో పరిష్కారం వచ్చేవరకు ఓపికగా ఉండాలన్నారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణానికి ప్రజలందరూ సహకరించాలన్నారు. తొలుత వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న, పలు ప్రమాదాల వలన స్టేషన్‌కు తీసుకువచ్చిన వాహనాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కారంపూడి సీఐ శ్రీనివాసరావు, రెంటచింతల ఎస్ఐ సీహెచ్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మాచవరంలో 'పొలం పిలుస్తోంది'



వరి పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

మాచవరం: పంటల సాగు చేస్తున్న రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫ్యూచర్ జనరల్ టోటల్ ఇన్సూరెన్స్ సొల్యూషన్స్ జిల్లా మేనేజర్ నింగయ్య తెలిపారు. మండల కేంద్రమైన మాచవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో వరి పంట సాగు చేయనున్న రైతులు ఎకరాకు రూ.630 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇన్సూరెన్సు పాలసీ వలన కలిగే లాభాలను తెలియజేసారు. గ్రామానికి చెందిన గుదె రామయ్య వరి పొలంలో పంట కోత ప్రయోగం చేపట్టారు. 25 చదరపు మీటర్ల వెడల్పులో నూర్పిడి చేయగా 16.500 కిలోల దిగుబడి రాగా, ఎకరాకు 30 నుంచి 32 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఉద్యాన సహాయకులు కరుణకుమారి, వ్యవసాయ సహాయకులు నర్సయ్య, సిబ్బంది సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చేనేత, హస్తకళలను ప్రోత్సహిద్దాం

సీఐ భాస్కర్



చేనేత హస్తకళా మేళాను ప్రారంభిస్తున్న సీఐ

గురజాల: చేనేత హస్తకళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సీఐ భాస్కర్ అన్నారు. స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో సోమవారం గ్రామీణ వీవర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేత హస్తకళా మేళా ప్రదర్శనను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒకే ప్రాంతంలో అన్ని రకాల వస్తువులు ఏర్పాటుచేయడం శుభ పరిణామమన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక చెక్క బొమ్మలు, ముత్యాలు, 1 గ్రామ్ గోల్డ్ జ్యుయల్రీతో పాటు చిన్నారుల ఆటవస్తువులు, పోచంపల్లి, మంగళగిరి, చీరాల, డ్రస్ మెటీరియల్స్ వంటివి ఒక ప్రాంతంలో లభించే విధంగా ఏర్పాటుచేసిన సొసైటీకి అభినందనలు తెలిపారు. ఎస్ఐ వై.వినోద్‌కుమార్, నిర్వాహకులు రంగస్వామి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు చర్యలు




గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రాధాకృష్ణన్

శావల్యాపురం: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు మాతాశిశు మరణాల నియంత్రణ దిశగా చర్యలు చేపట్టిందని ప్రత్యేక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది గర్భిణులను గుర్తించి ప్రారంభ దశ నుంచి ప్రసవమయ్యే వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రక్తహీనత తక్కువగా ఉన్నవారిని గుర్తించి అంగన్‌వాడీ సెంటరు ద్వారా పోషకాహారం అందేలా బాధ్యత వహించాలన్నారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండేలా ప్రసవం జరిగే వరకు నిరంతరం గర్భిణులను పర్యవేక్షణ చేస్తూ బీపీ, షుగర్, తదితర వాటి నుంచి సంరక్షించాలన్నారు.

ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో తప్పనిసరిగా గర్భిణు లు నమోదు చేయటం ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు పారదర్శకంగా అందుతాయన్నారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు వివరించి ప్రసవాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలు వైద్య ఆరోగ్య సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మీప్రసన్న, ఎంహెచ్‌పి సంకీర్తన పాల్గొన్నారు.

సౌత్‌జోన్ యోగా పోటీలకు ఏఎం రెడ్డి విద్యార్థిని



దీప్తిని అభినందిస్తున్న అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: సౌత్‌జోన్ యోగా పోటీలకు ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. కళాశాలకు చెందిన బి. ఫార్మసీ నాల్గవ సంవత్సరం విద్యార్థిని దీప్తి నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యోగ పోటీలలో ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. దీప్తిని కళాశాల కార్యదర్శి శాంతి శ్రీనివాసరెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సందీప్, విభాగాధిపతులు అభినందించారు.

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

నరసరావుపేట టౌన్: వేర్వేరు కేసుల్లో చోరీ సొత్తు కలిగి ఉన్నట్లు నేరం రుజువు కావటంతో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ప్రవళిక సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 2021 మే 29న ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎం. రాజశేఖర్ రెడ్డి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు రూ.25 వేలు నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే అదే రోజు ప్రకాష్ నగర్ చెందిన అన్నం రవణమ్మ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు నానుతాడును చోరీ చేయటంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పట్టణానికి చెందిన పాత నేరస్తుడు షేక్ నాగుల్ మీరా ఉరఫ్ బిల్లా పై రెండు దొంగతనాలు చేసినట్లు నిర్ధారించి అతని వద్ద నుంచి చోరీకు గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.